'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ప్రజల తీర్పులో పరమార్థం

టంకశాల అశోక్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలించినప్పుడు, ప్రజలను మెప్పించేందుకు అభివృద్ధి, సంక్షేమాలు మాత్రమే సరిపోవని అర్థమవుతున్నది. అవి కాకుండా వారింకా కోరుకుంటున్నవి ఏమిటనేది జాగ్రత్తగా గ్రహించి, అందుకు అనుగుణంగా మన పద్ధతులను సవరించుకోవటం అవసరం. దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఈ మాటలు తెలంగాణకు బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు. ఎక్కడైనా, ఎవరికైనా వర్తిస్తాయి.

తన పదేండ్ల పరిపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వాన చేసిన అభివృద్ధి, సంక్షేమాలు తక్కువ కావు. అందువల్లనే ఇప్పుడు పదేండ్ల తర్వాత ఓటమిలోనూ ప్రజలు గణనీయమైన స్థాయిలో ఓట్లు, సీట్లు ఇచ్చారు. ఆయా అభివృద్ధి, సంక్షేమాలు అందరి కళ్లెదుట ఉండటమే గాక ఎన్నో రికార్డులు సృష్టించాయి. దేశ విదేశాల్లో అనేక ప్రశంసలు పొందాయి. వీటన్నింటికి తలమానికంగా తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అనుగుణమైన స్థాయిలో ప్రజల జీవితాలు పట్టణాలు, గ్రామాల్లో కూడా మెరుగుపడ్డాయి. ఇదంతా ప్రభుత్వ విమర్శకులు సైతం బహిరంగంగా కాకపోయినా జనాంతికంగా అంగీకరిస్తున్న విషయం.

భవిష్యత్తుకు సంబంధించి కూడా అభివృద్ధి, సంక్షేమ రంగాలలో కేసీఆర్ అనేక కొత్త హామీలను ఈ ఎన్నికల సందర్భంగా ఇచ్చారు. అటు ఆ గత పదేండ్ల రికార్డు, ఇటు ఈ కొత్త హామీలు ఉండి కూడా ప్రజలు ఎందువల్ల బీఆర్ఎస్‌ను అధికారం నుంచి తప్పించారనేది ప్రశ్న. పైన అన్నట్టు జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన కీలకమైన ప్రశ్న ఇదే. ఇందుకు సమాధానంగా పైపైన స్థూలంగా కనిపించేది కొంత ఉండగా, కొంత లోతులోకి వెళ్లి చూడవలసింది మరికొంత ఉన్నది. ఈ రెండింటిని కలిపి చూస్తే తప్ప విషయం సమగ్రంగా బోధపడదు.

స్థూలంగా కనిపించేవి ఈ విధంగా ఉన్నాయి. అవి పలువురు ఇప్పటికే ఎత్తిచూపుతున్నవే. లేదా బీఆర్ఎస్ నాయకత్వం స్వయంగా గుర్తిస్తున్నవే. అందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం. రైతుబంధు లభిస్తున్న లక్షలాది మందిలో అత్యధికులు సంతృప్తిగా ఉన్నా, పెద్ద రైతులకు కూడా ఇవ్వటం నచ్చనివారు అనేకులున్నారు. దళితబంధు ఒక గొప్ప పథకం కాగా, ఆర్థిక పరిమితుల వల్ల అది ఇప్పటికి కొద్ది మందికి మాత్రమే లభించటం, అది కూడా అధికారపక్షం వారి ఆశ్రితులకు మాత్రమేనన్న ఫిర్యాదు, మొత్తమ్మీద పథకం దశలవారీగా ప్రతి ఒక్క దళిత కుటుంబానికి అందగలదని కేసీఆర్ ఎన్నిమార్లు నమ్మకంగా చెప్పినా దళితులు సమాధాన పడకపోవటం మరో కారణం. ఇటువంటిదే బీసీ బంధు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేట్ ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పన దేశంలో మరెక్కడా లేనిస్థాయిలో ఇక్కడ జరిగాయని ప్రభుత్వం గణాంకాలతో సహా పలుమార్లు వివరించినా, యథాతథంగా ఆ అంకెలను ఎవరూ సవాలు చేయకపోయినా, యువకులు తమ నిరుద్యోగ సమస్యతో సతమతమవుతుంటారు గనుక ఈ వివరణలను వారు లెక్కచేయలేదు. అదే విధంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు. ఇటువంటివన్నీ కలిసి బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమయ్యాయి.

పార్టీ నాయకత్వం గుర్తించి ఇప్పటికే సూచనామాత్రంగా మాట్లాడిన లోపాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు, ఉద్యోగ, ఉపాధుల విషయమై వాస్తవాలను యువకులకు కొంతకాలం కిందటినుంచే తెలియజేయటంలో జరిగిన జాప్యం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల విషయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు లేకపోవటం. రైతుబంధు పరిధి నుంచి పెద్ద రైతులను తొలగించే ఆవశ్యకతను సకాలంలో గుర్తించకపోవటం. దళితబంధు అందనివారికి అందుకు కారణాలను మరింత విస్తృతంగా తెలిపి, రాగల కాలంలో అందగలదని ఇంకా శ్రద్ధగా, వ్యక్తుల స్థాయిలోనూ వివరించకపోవటం వంటివి. ఈ స్థితికి మూలం అతి విశ్వాసం. ఎప్పుడైనా అతి విశ్వాసం ముందుచూపు తగ్గటానికి, అజాగ్రత్త పెరగటానికి కారణం అవుతుంది.

ఆదివారం సాయంత్రం అంతిమ ఫలితాలు గమనించినప్పుడు, కాంగ్రెస్ గెలుపు, బీఆర్ఎస్ ఓటమి స్పష్టంగానే ఉన్నప్పటికీ, గెలుపోటముల మధ్య ఓట్ల అంతరాలను చూసినట్టయితే, పైన పేర్కొన్న వివిధ పరిస్థితుల విషయమై బీఆర్ఎస్ మొదటినుంచి జాగ్రత్త వహించి ఉంటే పరిస్థితి మరొక విధంగా ఉండేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాంగ్రెస్ పార్టీ అందరి ఎదుట కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను కాదనలేని స్థితిలో, కాదని ప్రజలను ఒప్పించలేని స్థితిలో, స్వయంగా తనపై గాని, తన రాష్ట్ర నాయకత్వంపై గాని ప్రజలకు ప్రత్యేకమైన విశ్వాసమేదీ లేని పరిస్థితుల మధ్య, ప్రజల్లో గల ఇటువంటి చిన్నా, పెద్దా అసంతృప్తులను తెలివిగా వాడుకొని, రెచ్చగొట్టి, తనకు ఓట్లుగా మలుచుకోగలిగింది. లేని పక్షంలో, బీఆర్ఎస్‌కు సీట్లు కొన్ని కోల్పోయినా మెజారిటీ లభించి ఉండేది.

బీఆర్ఎస్ ఓటమికి ఇటువంటివి పైకి కనిపించే స్థూలమైన కారణాలు కాగా, పైన అనుకున్నట్టు కొంత లోతులోకి వెళ్తే తోచే ముఖ్యమైన కారణాలు కొన్నున్నాయి. వాటిలో ఒకటి బీఆర్ఎస్ పార్టీకి సంస్థాపరమైనది, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యవస్థాపరమైనది కాగా, మూడవది సమాజ పరమైనది. వాటిని ఒక్కొక్కటిగా చూద్దాం. ఎప్పుడైనా సరే ఒక పార్టీ పద్ధతి ప్రకారం నిర్మాణమై, ఒక మంచి యంత్రం వలె పనిచేస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వలె వ్యవహరించినట్టయితే అందువల్ల ఒనగూడే ఉపయోగాలు కొన్ని ఉంటాయి. ఉదాహరణకు పైన చర్చించిన అంశాలనే పరిగణనలోకి తీసుకుంటే, రైతుబంధు, దళితబంధు, ఉద్యోగ ఉపాధులు, ఇళ్ల వంటి విషయాలను, పార్టీ శ్రేణులకు తగిన శిక్షణ ఇచ్చినట్టయితే పట్టణాల్లో గ్రామాల్లో కూడా ప్రజలకు, యువకులకు ఒకటికి నాలుగు సార్లు వివరంగా చెప్పగలవు. తాము చెప్పలేని ప్రశ్నలు ఏవైనా ఎదురైతే పై స్థాయి నాయకత్వాన్ని సంప్రదించి ఆ పని చేయగలవు. ప్రజల సూచనలు ఏవైనా ఉంటే నాయకత్వం దృష్టికి తేగలవు. ఇదంతా చేయటం వల్ల అసంతృప్తి చెందిన వారిలో కొందరిని సమాధానపరచవచ్చు. మరికొందరికి ప్రభు త్వం పార్టీ తమను పట్టించుకొని మాట వింటున్నాయనే సంతృప్తి అయినా కలుగుతుంది. ఈ క్రమంలో పార్టీ శ్రేణులకు కూడా ఆయా అంశాలపై తగిన పరిజ్ఞానం, నేర్పరితనం ఏర్పడుతాయి. ఆ విధంగా ఇదొక పద్ధతిగా మారి, ఇటువంటి వాటితో సహా అన్ని విషయాల్లో పార్టీకి, ప్రభుత్వానికి ఉపయోగకరమవుతాయి.

ఇటువంటి పద్ధతిలో బీఆర్ఎస్ పార్టీ నిర్మితమై ఉండినట్టయితే, పైన ప్రస్తావించినటువంటి సమస్యలు గణనీయంగా తగ్గి ఉండేవి. ఒక శాస్త్రీయమైన రాజకీయ పార్టీ ఎప్పుడైనా యుద్ధకాలపు పార్టీ, శాంతికాలపు పార్టీ అని రెండు విధాలుగా పనిచేయాలి. యుద్ధకాలమన్నది ఎన్నికల సమయం, లేదా ఏవైనా సవాళ్లు, ప్రత్యేక పరిస్థితులు ఏర్పడినప్పుడు. రెండు ఎన్నికలు, లేదా ఏవైనా ప్రత్యేక పరిస్థితుల మధ్యది శాంతికాలమవుతుంది. ఆ సమయాలలో పార్టీ ఇటువంటి నిర్మాణాత్మక, ఉపయోగకర పాత్రను పోషించటం ప్రయోజనకరమవుతుంది స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో కూడా. అటువంటి పార్టీయే బలమైన పునాదులతో, సరైన నిర్మాణంతో ఆటుపోట్లను తట్టుకొని నిలబడుతుంది. ముఖ్యంగా ప్రాంతీయ ప్రయోజనాల కోసం పనిచేసే ఫెడరల్ పార్టీలకు స్వయంగా నిలిచేందుకైనా, జాతీయ పార్టీలను తట్టుకునేందుకైనా ఇది తప్పనిసరి. ఈ క్రమంలోనే పార్టీ శ్రేణులకు పార్టీ సిద్ధాంతాలలో, విలువలలో శిక్షణ ఇస్తూ పోవాలి. ఇరువై ఏండ్లు దాటిన బీఆర్ఎస్ విషయంలో ఇది ఇంతకాలం ఏం జరిగినా, జరగకున్నా ఇప్పుడు జరగటం అవసరం.

బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం కూడా చేసి ఉండవలసిన మరొక ముఖ్యమైన పని ప్రజా సంబంధాలు, మీడియా సంబంధాలు బాగా నెరపటం. మీడియా సంబంధాలు ఇక్కడే గాక ఢిల్లీ స్థాయిలోనూ అవసరం. ఎందువల్ల? అది లేకపోవటం వల్ల ఉద్యమ కాలం నుంచి కూడా జరుగుతున్న నష్టాలు ఏమిటనే వివరాల్లోకి ఇక్కడ పోవటం లేదు. కానీ, ఆ పని ఇప్పటికైనా జరిగితే ఆ నష్టాలు మన్నుందు తగ్గుతాయి. ఈ రెండు విధాలైన సంబంధాల కొరతకు, ఈ విధమైన ఎన్నికల ఫలితాలకు ఎంతో కొంత సంబంధం ఉందనేది విశ్లేషణల్లోకి వెళ్లినట్టయితే అర్థమవుతుంది. ఇక ప్రభుత్వ వ్యవస్థాపరమైన కారణాల్లోకి వెళ్లినట్టయితే, గతంలో ప్రభుత్వంలోని పౌర సంబంధాల శాఖలు క్రియాశీలకంగా, సజీవమైన పాత్రలను పలు విధాలుగా, పలు రూపాల్లో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, మండలస్థాయి వరకు పోషిస్తుండేవి. ఇప్పుడదంతా లుప్తమైంది. ఇది కూడా ఇప్పుడు కొంత నష్టం జేసింది.

ఇక, పైన అనుకున్న సమాజపరమైన కారణాలను దృష్టిలోకి తీసుకున్నప్పుడు ఆసక్తికరమైన విషయాలను గమనించవచ్చు. అవి జాగ్రత్తగా అర్థం చేసుకోవలసినవి. తెలంగాణలో మొదటి నుంచి గల ప్రజా చైతన్యం, నక్సలైటు ఉద్యమ చైతన్యం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కలిగించిన చైతన్యం, ఆర్థిక సంస్కరణల కాలం నుంచి పెరుగుతున్న అభివృద్ధి, సంపదలు, చదువులు, ఆకాంక్షలు, అవకాశాలు, పట్టణీకరణలు, ఆధునిక మార్పులకు ఎక్స్‌పోజర్ వంటివి సమాజంలో ఊహించని వేగంతో మార్పులను తెస్తున్నాయి. పట్టణాల్లో, గ్రామాల్లో, అన్నివర్గాల ప్రజల్లో. వాటిలో కొన్ని ప్రస్ఫుటంగా పైకి కన్పిస్తాయి, కొన్ని కన్పించవు గాని ఆయా వర్గాలు, వ్యక్తుల ఆలోచనలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయి. కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత సంబంధాలు, సామాజిక సంబంధాలలో మాత్రమే కాదు. తమ చుట్టూ ఉండే సంస్థల నుంచి మొదలుకొని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాల వరకు కూడా. సామూహిక ప్రయోజనాలు, అభివృద్ధి, సంక్షేమాలు ఎంత బాగా ఉన్నా.. వ్యక్తిగత లాభాలకు పెద్దపీట వేయడం ఒక ధోరణిగా మారి బలపడుతున్నది. వారికి ఎంతజేసినా సంతృప్తి కలగటం లేదు.

ఈ విధమైన పరిణామాలను, నేపథ్య స్థితిని ప్రస్తుత ఎన్నికల పరిస్థితులకు వర్తింపజేసినట్టయితే ఓటర్ల నుంచి వినిపించిన పలు వ్యాఖ్యలను అనేకులు గుర్తించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ చర్యలతో మీకూ లాభం కలుగుతున్నదా అని ప్రశ్నిస్తే, అవును, అయితే ఏమిటి? అన్నది ఎదురు ప్రశ్న. ఇది ఎవరున్నా జరుగుతుంది. వీళ్లుపోయి మరొకరు వచ్చినా. వాళ్ల జేబులోంచి ఇస్తున్నారా. ఇవి బాగున్నా ఇంకొకరు వచ్చి ఇంకా బాగా ఇస్తారేమో. అసలు ఎప్పుడూ ఒకళ్లకే ఎందుకేయాలి ఓటు కొన్ని ఇచ్చి, కొన్ని ఇయ్యకపోతే కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకపోతే ఎందుకు ఒప్పుకోవాలి. వాళ్లు కొంత తిని మాకు కొంత ఇస్తున్నారు, అంతే కదా. ఇవీ ప్రశ్నలు, వ్యాఖ్యలు. ఎవరో ఒకరు కాదు, అనేకులు. పురుషులు, స్త్రీలు కూడా. వృద్ధులు సైతం. యువతీయువకులు సరే సరి. ఇది కాక, ఈ మార్పులు, ధోరణుల నేపథ్యంలో సోషల్‌మీడియా ప్రభావం సమాజంపై పెద్ద ఎత్తున ఉంటున్నది.

ఇటువంటి సామాజిక స్థితి గతంలో ఉండేది కాదు. ఈ ధిక్కార ధోరణులు పైన పేర్కొన్న సామాజిక, ఆర్థిక పరిణామాలు, ప్రభావాల వల్ల క్రమంగా రూపు తీసుకుంటున్నాయి. ఇతర చోట్ల కన్న ఎక్కువగా తెలంగాణలో. దీనిని కొందరు సరికొత్త ప్రజాస్వామిక చైతన్యం అని కూడా అంటున్నారు. బీఆర్ఎస్ ఓటమికి ఈ విధమైన పరిణామ క్రమం కూడా ఒక ముఖ్య కారణమైంది. కనుకనే అన్ని పార్టీలు కూడా నేర్చుకోవలసిన విషయాలు కొన్ని ఈ లోతైన సామాజిక పరిణామాలలో కొన్ని ఉన్నాయి.

నెదరని గురుతులు

బినకరుడి కాళ్లకు
నా కండ్లనతికించుకుని మలి
వెతుకుతాను నీ జాడ కోసం

నిశి రాత్రిలో
మిణుకు మిణుకు మిణుగురులు
తళుకు తళుకు చుక్కలు
తోడు నడుస్తాయి నా బాధ చూడలేక
అప్పుడప్పుడూ....
పున్నమి వెన్నెల నా చేతిలో
లాంతరై దారి చూపుతుంది

ఏ పొన్నపూలో వాసనలొదిలి
మనం ఏకాంతంగా కలుసుకునే చోట
నీవున్నవనే జాడ తెలుప జూస్తాయి
ఆ వాసనల దారం అంచులు పట్టుకొని నేనొస్తుంటే
అకస్మాత్తుగా ఓ పాడుగాలి దాన్ని మాయం చేసి
నన్ను దిక్కులేని దాన్ని చేస్తుంది సఖుడా...

అలసిపోయి
కొండ కొసల కూచుండి
దీర్ఘాలోచనలో ఉన్నపుడు
అక్కడే...అక్కడే...
మనం ఒకరి పాదాలతో
ఒకరం చేసుకున్న బాసలు గుర్తొచ్చి
ఒళ్లు జలదరిస్తుంది

దూప చేసి కానింత గొంతు తడుపుదామని
గబగబా కిందకి దిగి
ఏటి ఒడ్డుకు చేరుతాన
ఇరువురమే కమలాల మధ్య
దోబూచులాడుకున్న జ్ఞాపకమొకటి గురుతొచ్చేసరికి
దాహం మరింత పెరిగి గొంతెండిపోతుంది

నీ జ్ఞాపకాల వడగాలి
నా ఒంటిలో రాజేసిన వేడికి
నా నోటిలో లాలాజలం కూడా ఆవిరైపోతుంది

ఎటూ పాలుపోకా...
నీ జ్ఞాపకాల నుంచి తప్పించుకోవడానికి
ఓ కూని రాగం తీద్దామని గొంతెత్తితే
చివరికి నీతో కలిసి పాడుకున్న
ప్రణయ విరహ రాగమొకటి గుర్తొచ్చి
గొంతు పెగలక
మౌన రాగమే నా తోడు నడుస్తుంది...

దిలీప్.వి
84640 30808

తెలంగాణ రాష్ట్రం యావత్తూ ఎన్నికల హడావుడిలో మునిగిపోవడాన్ని అదనుగా చూసుకుని ఏపీ ప్రభుత్వం సాయుధపటాలంతో వచ్చి నవంబర్ 29న అర్ధరాత్రి వేళ నాగార్జునసాగర్ డ్యామ్ ఆక్రమణకు పూనుకున్నది. అక్కడి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ముళ్ల కంచెను వేసింది. అంతేగాకుండా 5,7 గేట్ల వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్లను తెరిచి దౌర్జన్యపూరితంగా దాదాపు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకుంటున్నది. సత్వరమే అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం విషయాన్ని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) దృష్టికి తీసుకెళ్లడం, అటు తరువాత కేంద్ర హోంశాఖ, జలవనరుల శాఖ రంగంలోకి దిగడం, యథాతథస్థితిని కొనసాగించాలని ఆదేశించడం తెలిసిందే. అయితే ఇక్కడ అసలు విషయం ఏమిటంటే ఏపీ ఇంత అప్రజాస్వామికంగా ఎందుకు వ్యవహరించింది? ఎవరు దీనంతటికీ ప్రధాన కారకులు? ఏపీ చర్యల పర్యవసానం ఎలా ఉండబోతున్నది? ఎవరికి నష్టం వాటిల్లనుంది? అనేవి ఇప్పుడు చర్చించుకోవాల్సిన అంశాలు. లోతుగా విశ్లేషించుకోవాల్సిన విషయాలు.

సాగర్ వివాదానికి మూలమేది?

మ్యాకం రవికుమార్
91827 77621

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 85లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ, నియంత్రణ, నిర్వహణకు నాటి కేంద్ర ప్రభుత్వం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసింది. చట్టంలోని సబ్-సెక్షన్ 85(8) ప్రకారం బోర్డు విధివిధానాల ప్రకారం గతంలో జరిగిన ఒప్పందాలు, ట్రిబ్యునళ్లు కేటాయించిన అవార్డుల మేరకు ఇరు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నది. గతంలో అలాంటివేవీ లేకపోవడం నేపథ్యంలో ఉమ్మడి ప్రాజెక్టుల నీటి వినియోగం అంశంపై కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో కేవలం ఏడాది కాల పరిమితితో ఇరు రాష్ట్రాలు తాత్కాలిక ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఏపీ 512 టీఎంసీలు, తెలంగాణకు 298.98 టీఎంసీలు వినియోగించుకోవాలని అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం అమలును రెండు రాష్ట్రాల ఈఎన్సీలు, కేఆర్ఎంబీ మెంబర్‌సెక్రటరీతో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ పర్యవేక్షిస్తుంది. ప్రాజెక్టులవారీగా నీటి అవసరాలకు సంబంధించి ఇరురాష్ట్రాలు ప్రతిపాదనలు పంపించాలి. అటు తరువాత ఆయా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆధారంగా త్రిసభ్య కమిటీ నీటి వినియోగానికి అమోదం తెలుపుతుంది. ఆ మేరకు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తారు. రాష్ట్రాల పునర్విభజన నాటి నుంచి ఇదే పద్ధతి కొనసాగుతున్నది.

పునర్విభజన చట్టం ప్రకారం శ్రీశైలం డ్యామ్ ఏపీ ఆధీనంలో, నాగార్జునసాగర్ డ్యామ్ తెలంగాణ పరిధిలో ఉన్నాయి. కానీ అందుకు విరుద్ధంగా, చట్టాన్ని, చేసుకున్న ఒప్పందాలను ఏపీ బేఖాతరు చేసింది. బరితెగింపుగా వచ్చి సాగర్ డ్యామ్‌ను ఆక్రమించింది. ఎందుకు? తెలంగాణ ఏపీ కోరినన్ని నీళ్లు ఏమైనా ఇవ్వలేదా? అంటే, అలాంటిదేమీ లేదు. వాస్తవంగా నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్ల నుంచి 2023-24 నీటి సంవత్సరానికి (జూన్ 1, 2023-మే 31, 2024) నీటి వినియోగానికి సంబంధించి అక్టోబర్ 6న నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనే పలు నిర్ణయాలు చేశారు. అందులోభాగంగా నాగార్జునసాగర్ జలాశయం నుంచి 15 టీఎంసీల నీటిని ఏపీకి మూడు విడతలుగా ఇవ్వాల్సి ఉంది. అందులో భాగంగా అక్టోబర్‌లో ఒక విడత 5 టీఎంసీలను విడుదల చేశారు. మిగతా 10 టీఎంసీలను వచ్చే జనవరి, ఏప్రిల్ నెలల్లో 5 టీఎంసీల చొప్పున విడుదల చేయాల్సి ఉంది. నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి నీటి విడుదలకు ఎలాంటి ఇండెంట్‌ను ఏపీ పెట్టలేదు. విడుదల చేయాలనే నిర్ణయాలు కూడా లేవు. అయినప్పటికీ ఏపీ జులుం ప్రదర్శిస్తూ రాత్రికి రాత్రికి వచ్చి డ్యామ్‌ను ఆక్రమించి, కుడివైపు గేట్లను తెరిచి దౌర్జన్యంగా నీటి విడుదలను చేపట్టడం గమనార్హం.

> ఏపీ ప్రభుత్వం దౌర్జన్యపూరిత వైఖరిపై లోతుగా చర్చించుకోవాల్సిన అవసరమున్నది. ఎందుకంటే ఏపీ నీటిని తరలించుకుపోవాలంటే డ్యామ్ గేట్లనే తెరవాల్సిన పనిలేదు. కుడివైపు పవర్‌హౌజ్ ద్వారా కూడా తీసుకుపోయే అవకాశముంది. గత పదేండ్లుగా అనేకసార్లు అక్రమంగా నీటిని మళ్లిస్తూనే ఉన్నది. అయినప్పటికీ ఇప్పుడు అదేమీ చేయకుండా ఏకంగా సాయుధబలాలతో వచ్చి, బరితెగించి డ్యామ్‌ను ఆక్రమించి, నీళ్లను తీసుకుపోవడమే తీవ్రంగా పరిగణించాల్సిన విషయం.

దీనికి కారణాలు కూడా సుస్పష్టం. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం కాకుండా, అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956 సెక్షన్ 3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తేనా, లేదంటే ప్రస్తుత బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే న్యాయమైన వాటాల పంపిణీ కోసం కావాల్సిన అధికారాలను కల్పించాలని రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ నాటి నుంచి తెలంగాణ డిమాండ్ చేస్తున్నది. పదేండ్లుగా తెలంగాణ సర్కారు, సీఎం కేసీఆర్ చేసిన అలుపెరగని పోరాటంతో కేంద్రం ఎట్టకేలకు ఇటీవలనే దిగొచ్చింది. న్యాయమైన వాటాల పంపిణీ చేపట్టాలని ప్రస్తుత బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నూతన మార్గదర్శకాలను జారీ చేయించడంలో తెలంగాణ విజయవంతమైంది. నాటి నుంచి ఏపీ సర్కారు జీర్ణించుకోలేకపోతున్నది. కేంద్రం జారీ చేసిన ఆదేశాలను నిలిపేయాలని కోరుతూ సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించింది. విచారణను వాయిదా వేయాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లోనూ వాదనలు వినిపించింది. అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అంతేకాదు, తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కీలకమైన అనుమతులను కూడా సాధించింది. ఎత్తిపోతలను కూడా ఇటీవలనే ప్రారంభించింది. అదికూడా కంటగింపుగా మారింది. సాగర్ డెల్టా రైతాంగం, సీమ కూడా ఇదే విషయమై ఏపీ సర్కారుపై గుడ్లురుముతున్నది. ఈ నేపథ్యంలోనే వారిని శాంతపరచడానికంటూ, ఆరోపణలను తప్పించుకునేందుకు ఏపీ ఇంతటి దౌర్జన్యానికి పూనుకున్నదని అర్థమవుతున్నది. అదీగాక ఏపీ ఆది నుంచీ కృష్ణా జలాల విషయాల్లో తెలంగాణతో కయ్యానికి కాలు దువ్వుతున్నది. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులకు అడుగడుగునా అడ్డం పడుతూ వస్తున్నది. మరోవైపు కృష్ణాజలాలను దౌర్జన్యపూరితంగా బేసిన్ అవతలికి అక్రమంగా తరలిస్తూనే ఉన్నది. ఇప్పుడు కూడా అదే రీతిన వ్యవహరించింది. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. కాకపోతే అప్రజాస్వామికంగా తెగబడటమే అభ్యంతరకరం.

ఇదిలా ఉంటే ఏపీ దుందుడుకుతనానికి, ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదాల పాపానికి పూర్తిగా కేంద్రసర్కారుదే బాధ్యత. కృష్ణా జలాలను న్యాయపరంగా పంపిణీ చేసేందుకు ట్రిబ్యునల్‌కు ఏర్పాటు చేయకుండా, ఆ మేరకు కావాల్సిన అధికారాలను కల్పించడకుండా న్యాయసలహాలు తీసుకోవాలనే సాకుతో పదేండ్లుగా కేంద్రంలోని మోదీ సర్కారు నిర్లక్ష్యం చేసింది. ఏడాది కాలపరిమితితో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఒప్పందాన్ని 2015 నుంచి కొనసాగిస్తూ వస్తున్నది. గతేడాది ఆ తాత్కాలిక ఒప్పందానికి ఇక ఎంతమాత్రం ఒప్పుకునేది లేదని తెలంగాణ తేల్చిచెప్పింది. ట్రిబ్యునల్ అవార్డు వచ్చేంతవరకూ 50:50 నిష్పత్తిలోనే కృష్ణా జలాలను వినియోగించుకుంటామని కుండబద్దలు కొట్టి చెప్పింది. ఒకవైపు ఇరు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ పూర్తిగా చేపట్టకుండానే, మరోవైపు రివర్ బోర్డుల అధికార పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం గెజిట్ విడుదల చేసింది. ప్రాజెక్టులను రివర్ బోర్డులకు అప్పగించాలని ఆదేశించింది. ఇప్పటికి రెండేండ్లు గడిచినా ప్రాజెక్టులకు సంబంధించిన ఆపరేషన్ ప్రొటోకాల్‌నూ రూపొందించలేదు. మధ్యలో ఆ ప్రయత్నం చేసినా అది కొసెల్లలేదు. తప్పులతడకగా, అవార్డులకు భిన్నంగా ఉందని, అంగీకరించేది లేదని తెలంగాణ స్పష్టం చేసింది. అంతేకాదు ఏపీ అక్రమంగా కృష్ణా జలాలను బేసిన్ అవతలికి తరలించుకుపోతున్నదని అనేక మార్లు ఫిర్యాదులు చేసినా, లెక్కకు మించి లేఖలు రాసినా అటు కేంద్రం, ఇటు కేఆర్ఎంబీ తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. వాటన్నింటి చర్యల ఫలితంగానే ఏపీ తాజా బరితెగింపు. ఇదిలా ఉంటే ఏపీ చర్యల ఫలితంగా తెలంగాణలో ప్రజానీకం తీవ్రంగా ప్రభావితం కానున్నది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో కృష్ణాలో నీళ్లు రాలేదు. ఇప్పటికే డ్యామ్‌లో నిల్వలు కూడా అడుగంటుతున్నాయి. మరో 6 నెలల వరకు నీటి అవసరాలు తీర్చుకోవాల్సి ఉన్నది. ఏపీ అక్రమంగా నీటిని మళ్లించుకుపోతే డ్యామ్‌లో నీటినిల్వలు అడుగంటి హైదరాబాద్ నీటి సరఫరా వ్యవస్థ దెబ్బతింటుంది. ఫలితంగా కృష్ణా బేసిన్‌లో ఉన్న రెండు కోట్ల మందికి పైగా జనాభా తాగునీటి అవసరాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని డ్యామ్ నిర్వహణను ఏపీ నుంచి తప్పించి వెంటనే తెలంగాణకు అప్పగించాలి.

గాజాలో శాశ్వత శాంతి నెలకొల్పాలి

ఇజ్రాయెల్ తన బలమైన సైనిక శక్తితో గాజాపై ప్రతీకార దాడులతో విరుచుకుపడింది. గాజాలోని హమాస్ తీవ్రవాదులను అంతం చేస్తున్నామనే నెపంతో గాజా పౌరులపై కూడా అరాచక దాడులు చేసింది. బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు వేలసంఖ్యలో మరణించారు. మొత్తంగా 13 వేలమంది చనిపోయారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. వాస్తవ మరణాలు అంతకు మించే ఉంటాయని అనధికార వర్గాలు చెప్తున్నాయి. ఇంకా పూర్తి సమాచారం, గణాంక వివరాలు బయటకు రాలేదు.

కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

ప్రస్తుతం ఇజ్రాయెల్, గాజా మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీంతో గాజా ప్రజలకు కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికింది. అయితే అది కూడా శు